ప్రజాశక్తి
గురువారం 29 జూన్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

టిక్కెట్లపై కనిపించని ధీమా

- వైసిపిలో పెరుగుతున్న అసమ్మతి గళాలు
- నియోజకవర్గాల్లో ద్వితీయ నేతలూ పోటీకి సై..
- ఒంగోలు, వైపాలెం మినహా అన్ని చోట్లా ఇదే పరిస్థితి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గిద్దలూరులో పాలకపక్షానికి చెందిన మాజీ ఎంపీపీ వంశీధర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్టు ఇస్తే తాను పోటీ చేస్తానని ప్రకటించారు. ఆయన పలువురు పార్టీ నేతలతో రెండ్రోజుల క్రితం ప్రత్యేక భేటీ ఏర్పాటుచేసి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. 'మీకు ఎవరికైనా సీటు వస్తే మీకు చేస్తాను.. నాకు వస్తే చెయ్యండి' అంటూ ఆయన పార్టీ నేతలను కోరారు. అక్కడ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు ఇలా టిక్కెట్ల కోసం పావులు కదుపుతున్నారు.

మార్కాపురం నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే కే.నాగార్జునరెడ్డికి పోటీగా పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. మార్కాపురంలో పోటీ చేసేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ ఎమ్మెల్యేకూ, ఈయనకూ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కూడా మొదలైంది. ఎమ్మెల్యే వల్ల తనకు ప్రాణహాని ఉందని ఇటీవల ఒంగోలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. మార్కాపురంలోనే పోటీ చేసేందుకు పలువురు నేతలు ఎమ్మెల్యేలకు పోటీగా అధిష్టానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. ▶ 2లో

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిసి కెమెరాల ఏర్పాటు 3లో

జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున 5లో

తెలుగుదేశానికి ప్రజల్లో ఆదరణ లేదు

మంత్రి సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ లేదని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ భూ స్థాపితం కావడం ఖాయమని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని విశ్వనాథపురంలో పర్యటించారు. అనంతరం రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం, వాటర్ షెడ్ ప్రాజెక్టులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, సర్పంచ్ శేషం మాధవి రంగబాబు, వైసిపి నాయకులు సింగారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి

యామినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

మహిళా పోలీస్‌కు ప్రశంస

ప్రజాశక్తి-కొత్తపట్నం

సచివాలయంలో ప్రజలకు సకాలంలో సేవలు అందించేందుకు గానూ మహిళా పోలీసులకు ఎస్పీ మల్లికాగర్గ్ బుధవారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అందులో భాగంగా కొత్తపట్నం మండలం గవండ్లపాలెం సచివాలయ పరిధిలో మహిళా పోలీస్ యామినికి కూడా ప్రశంసపత్రాన్ని ఇచ్చారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పల్లామల్లి(సిఈ)లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కోదాటి ఆదిలక్ష్మి(42) ఆత్మహత్య చేసుకుంది. స్థానిక పల్లపోతువారి బజారులోని సందులో నివాసముంటున్న కోదాటి ఆదిలక్ష్మికి 18 ఏళ్ల క్రితం వివాహమైంది. గత పదేళ్ళ క్రితం భర్తతో విడాకులు తీసుకుంది. మంగళవారం రాత్రి ఆమె తండ్రి కోటేశ్వరరావు ఆదిలక్ష్మిని మందలించాడు. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజామున రెండు గంటల సమయంలో ఆదిలక్ష్మి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నివాళులర్పిస్తున్న శిద్దా రాఘవరావు

మాజీ మంత్రి 'శిద్దా' నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

ఆదూరు బాలక్రిష్ణయ్య చిత్రపటానికి రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఘనంగా నివాళులర్పించారు. గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఆదూరి గిరిబాబు తండ్రి ఆదూరి బాలక్రిష్ణయ్య ఇటీవల మృతి చెందారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిద్దా రాఘవరావు పాల్గొని నివాళులర్పించారు. గిరిబాబు కుటుంబసభ్యులు ఆదూరు సిద్ధయ్య, శాంతికుమార్, శ్రీనివాసులు, ఆదూరు గిరిబాబుల దంపతులను పరామర్శించారు.



సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-కొండపి

పది సంవత్సరాల పాటు కొండపి హెచ్‌పిలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళుతున్న ధైవ కృపను కాంప్లెక్స్ చైర్మన్ సుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి, అంబేద్కర్ నగర్ వాసులు, పాఠశాల చిన్నారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తిరుపతి స్వామి, అశోక్, శ్రీనివాసరావు, ఎల్.వి ప్రసాద్, సిఆర్‌పి ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్షపై మండల స్థాయి అధికారులతో బుధవారం ఎంపిడిఒ అద్దంకి శ్రీనివాసమూర్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒఆర్డి జనార్దన్, హౌసింగ్ ఏఇ బాలునాయక్, ఏపిఎం కె.గోపాలకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తును కాలరాయొద్దు

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

చిన్నారులను విద్యకు దూరం చేసి.. వారి భవిష్యత్తును కాలరాయొద్దని నవోదయ హ్యూమన్ రైట్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్ అన్నారు. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని మైలచర్ల గ్రామంలో విద్యకు దూరంగా ఉన్న 8 మంది చిన్నారులను గుర్తించారు. చేన్నప్ప నాయునిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాంద్‌బాషాతో కలిసి గౌస్ బుధవారం మైలచర్ల గ్రామాన్ని సందర్శించారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. గ్రామం నుంచి పాఠశాల ఏడు కిలోమీటర్ల దూరం ఉండడంతో చిన్నారులు పాఠశాలకు వెళ్లేందుకు దాతల సహకారం తీసుకొని ఆటో ఏర్పాటు చేశారు.

ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించబోం

వైసిపి నేతలకు టిడిపి హెచ్చరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని టిడిపి నాయకులు హెచ్చరించారు. బుధవారం శింగరాయకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు ఇష్టం వచ్చినట్టు ఆరోపణ చేస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు దమ్ముంటే విచారణ జరుపుకోవాలని చెప్పారు. లోకేష్ పాదయాత్ర అడ్డుకుంటామని చెబుతున్న అశోక్‌బాబు అడ్డుకుంటే ఎలా ఉండిద్దో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొనపురెడ్డి వెంకటసుబ్బారావు, బ్రహ్మయ్య, షేక్.అబ్దుల్‌సుభాన్, సుదర్శ ప్రసాదరావు, నక్క బ్రహ్మేశ్వరరావు, ఇమ్మడిశెట్టి రామారావు, కోట శ్రీను, కనిగిరి వెంకటేశ్వర్లు, గనిపినేని రవిచౌదరి, వలేటి రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిక్కెట్లపై కనిపించని ధీమా

(మొదటిపేజీ తరువాయి)

కనిగిరి నియోజకవర్గంలోనూ స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్‌యాధవ్‌కు వ్యతిరేకంగా రెడ్డి సామాజికవర్గం బలంగా పావులు కదుపుతోంది. పార్టీ సమావేశాలను సైతం ఈవర్గం నేతలు బహిష్కరించి తన అసమ్మతిని తెలియజేస్తున్నారు. అక్కడ రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి కనిగిరిలో పోటీ చేసేందుకు ప్రయత్నాల్లో ఉన్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పలువురు నేతలు వేరుకుంపట్లు పెట్టి వ్యవహారాలు సాగిస్తున్నారు.

దర్శి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కూ, జడ్పీఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకి మధ్య చాలాకాలంగా ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. ఇక్కడ ప్రోటోకాల్ వ్యవహారాల్లోనూ అధికారులు కొందరు తీసుకునే నిర్ణయాలు వివాదాలకు దారితీస్తున్నాయి. ఇక్కడ ఆధిపత్యం కోసం రెండు గ్రూపుల మధ్య హోరాహోరీగానే వ్యవహారాలు సాగుతున్నాయి. బూచేపల్లి తిరిగి ఇక్కడ పోటీచేసేందుకు అన్ని రకాలుగా సిద్ధం చేసుకుంటున్నారు. రెండు పర్యాయాలు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచినందున మంచి పట్టున్నందున ఆయన ఇక్కడ తన రాజకీయాన్ని కొనసాగిస్తున్నారు.

ఇలా దాదాపుగా చెప్పుకుంటూపోతే అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. కారణం వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో ఇప్పటివరకూ స్పష్టత లేదు. ఎవరిని బరిలో దింపాలనే దానిపై ఇంకా సిఎం జగన్ నిర్ణయం తీసుకోలేదు. స్పష్టత ఇవ్వలేదు. సంకేతాలు లేవు. దీంతో ఎవరికివారే టిక్కెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్టానం వద్దకు వెళుతున్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఒంగోలు, వైపాలెంలో తప్ప ఎవరికీ టిక్కెట్లపై స్పష్టత లేదు. సిట్టింగులపై వ్యతిరేకత పెరగడంతో వీరిని తప్పిస్తారనే ప్రచారం కూడా తీవ్రంగానే ఉంది. దీంతో నియోజకవర్గాల్లో ఆర్థిక సామాజికబలం ఉన్న నేతలు ముందుకు వస్తున్నారు. ప్రజల్లో అసంతృప్తిగా ఉన్న వారికి టిక్కెట్లు రావనే ధీమాతోనూ పలువురు నేతలు తెరపైకి వచ్చారు. ఏదో పార్టీలో టిక్కెట్లు తెచ్చుకోవచ్చనే భావనతోనూ కొందరున్నారు. ఇక్కడ రాకుంటే అవతల పార్టీలో తెచ్చుకుందామనే ఆలోచనలు చేస్తున్నారు. ఇక జిల్లా నాయకత్వం కూడా గందరగోళంలో ఉన్నందున నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి వచ్చింది. సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి అధిష్టానంలోని కొందరు పెద్దలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో వైసిపిలో కొద్దిరోజులుగా అనిశ్చితి కొనసాగుతోంది. క్రియాశీలక రాజకీయాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. ఒంగోలు నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. టిక్కెట్ల కేటాయింపులు, ఎంపీ టిక్కెట్లు, జిల్లా పెత్తనం వంటి అంశాలపై స్పష్టత లేదు. ఎవరి పాత్ర ఏమిటనే దానిపైనా గందరగోళం నెలకొంది. మంత్రి ఆదిమూలపు సురేష్ పాత్ర కూడా పరిమితంగానే ఉంది. ఆయన పార్టీ వ్యవహారాల్లో పెద్దగా జోక్యం చేసుకోలేని పరిస్థితి ఉంది. మార్కాపురంలో సిఎం పర్యటన సందర్భంగా జరిగిన ప్రోటోకాల్ వివాదం తర్వాత ఆయన ఆచీతూచీ అడుగులు వేయాల్సి వస్తోంది. ప్రస్తుతం వెలిగొండపైనే ఆయన దృష్టి సారించారు. మరో నాలుగు నెల్లలో దాన్ని ప్రారంభించాల్సి ఉన్నందున ప్యాకేజీలు, నిర్వాసితుల తరలింపుపై దృష్టి పెట్టారు. పార్టీ వ్యవహారాలపై కేంద్రీకరించడం లేదు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మాత్రమే ఒంగోలు వచ్చిపోతున్నారు. ఏదేమైనా పాలకపక్షంలో ప్రస్తుతం అస్పష్ట రాజకీయాలు కొనసాగుతున్నాయి. అసమ్మతులు తీవ్రమవుతున్నాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ ఇవి ఎక్కువ కావడం భవిష్యత్‌లో ఆ పార్టీలో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయోనన్న చర్చకు తావిస్తున్నాయి.

తహశీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

శ్రీనివాసరెడ్డి

మార్కాపురం మండల తహశీల్దార్‌గా ఎస్.శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈయన బుధవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పనిచేస్తూ ఇటీవల కాలంలో జరిగిన బదిలీల్లో భాగంగా మార్కాపురానికి వచ్చారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వం పెంచిన కరెంటు బిల్లులకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో 30న విద్యుత్ కార్యా లయాల వద్ద జరిగే ధర్నా లను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు కె.మాల్యాద్రి, ఎస్‌డి.మౌలాలి పిలుపునిచ్చారు. బుధవారం సిపిఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పి మస్తాన్‌రావు, వి సుబ్బారావు, వెంకట రెడ్డి, బి మహదేవయ్య పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIK AKBAR BHASHA
S/o.SHAIK SILAR SAHEB(Old Name)
Resident of D.No.6-124/14,Kurnool Road,Srinagar Colony, 1st Line,Ongole, Prakasam Dist, Andhra Pradesh.
I have changed my name form
SHAIK AKBAR BHASHA to
SHAIK AKBAR BASHA(New Name)
S/o.SHAIK SILAR SAHEB
Hence forth i will be Know as
SHAIK AKBAR BASHA
will be applicable for all purpose

దావాసమను

అండర్ ఆర్డరు 5 రూల్స్ 1అండ్ 5 ఆఫ్ సి.పి.సి.
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 61/2022

గోసుల వెంకటసుబ్బయ్య .... వాది
వర్సెస్
పోకూరి పద్మనాభరావు .....ప్రతివాది
కు.

ప్రతివాది; పోకూరి పద్మనాభరావు తండ్రి గురవయ్య,హిందువు,వయస్సు 45 సంవత్సరాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాకిన్ : డోర్‌నెం 6-16,పిసిపల్లి గ్రామం అండ్ మండలం, ప్రకాశంజిల్లా ప్రస్తుత నివాసం; కలికవాయి గ్రామం అండ్ పోస్టు, సింగరాయకొండ మండలం,ప్రకాశంజిల్లా, కె.వరమేశ్వరి నలీల టెక్నాలజీస్ కేరాఫ్ ఇ ధనమ్మ, డోర్‌నెం 6-144, ధనలక్ష్మినగర్,అవిలాల, తిరుపతిసిటి, చిత్తూరు జిల్లా

పై నంబరు దావా పరిహారములు పొందగోరి వాది మీ పైన దావా దాఖలుచేసి యున్నారు. గనుక మీ ఆక్షేపణలున్నచో తేది:12-07-2023న పగలు 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేదా ప్లీడరు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై తెల్పుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడునని తెల్పుకొనేది.

(బై ఆర్డర్ ఆఫ్ కోర్ట్)

వాయిదా తేది 12-07-2023 ఇట్లు
కనిగిరి సాధు కొండలరావు
తేది 29-06-2023 పిటీషనరు తరుపు
న్యాయవాది
కనిగిరి,ప్రకాశం జిల్లా
సెల్: 9440432595

గ్రామపంచాయతీ కార్యాలయం - సూరవరపుపల్లి గ్రామము
యద్దనపూడి (మం), బాపట్ల

ఆర్.ఓ.సి.నెం. 04/2023 తేది: 27-06-2023

బాపట్ల జిల్లా, యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామ పంచాయితీలో తేది 01-07-2023 వ సంవత్సరం నుండి తేది 30-06-2024 సంవత్సరం వరకు ఒక్క సంవత్సరకాలంనకి పని చేయుటకుగాను ఈ దిగువ పంపిన సిబ్బంది పని చేయుటకు సీలు వేసిన టెండర్లను తేది 01-07-2023 మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఈ దిగువ సంతకం దారు వద్ద గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సూరవరపుపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద స్వీకరించబడును సదరు సీలు వేసిన టెండర్లను అదే రోజు అదే ప్రదేశంలో మధ్యాహ్నం 3.30 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువ బడును. ఆసక్తి గలవారు ఆయా ఐయిటంకు ఎదురుగా చూపబడిన ధరావత్తు చెల్లించి టెండరులో పాల్గొనవచ్చును. ధరావత్తు చెల్లించని మరియు సకాలంలో రాని టెండరులు స్వీకరించబడవు. ఏ కారణం చూపకుండానే టెండర్లు వాయిదా వేయుటకు లేదా రద్దు పరుచుటకు పంచాయితీ కార్యదర్శికి అధికారం కలదు. మిగిలిన విషయాలు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.సం.	సరఫరా వివరములు	చెల్లించవలసిన ధరావత్తు మొత్తం రూ.
1)	01-07-2023 వ సం. నుండి 30-06-2024 వరకు ఎలక్ట్రిషియన్ రోజు కూలిపై పనిచేయుటకు (ఒకరు)	రూ 100/-
2)	01-07-2023వ సం. నుండి 30-06-2024 వరకు స్వీపరు రోజువారీ కూలిపై పనిచేసేందుకు (ఒకరు)	రూ. 100/-

గమనిక : 1. పంచాయితి నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్రమే చెల్లింపులు చేయబడును.
2. టెండర్లకు సంబంధించిన ఏ విషయంలోనైనను, ఏ న్యాయస్థానంలో ఫిర్యాదు చేయరాదు.
3. పంచాయితీ కార్యదర్శి గారిచే ఎప్పటికప్పుడు జారి చేయబడు ఆదేశాలను టెండరుదారు తప్పక పాటించవలెను.

సం/- కె.నాగేష్, పంచాయతి కార్యదర్శి,
సూరవరపుపల్లి గ్రామపంచాయతీ
యద్దనపూడి మండలం, ప్రకాశంజిల్లా

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని బర్జర్ పెయింట్ డిపో అసిస్టెంట్ మేనేజరు మహేష్ పేర్కొన్నారు. ఇంకొల్లు కాలేషా జనరల్స్ ఆధ్వర్యంలో జరిగిన పెయింటర్ల శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బర్జర్ పెయింట్ కంపెనీలో నమోదైన కార్మికులకు బీమా సౌకర్యంతో పాటు, వారి పిల్లలకు ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నామన్నారు. ఉన్నత చదువులు చదివిన పిల్లలకు తమ సంస్థలోనే ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు డిస్ట్రిబ్యూషన్ సేల్స్ ఆఫీసర్ కామేష్ వివరించారు. తప్పనిసరిగా కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకొని ఉపాధి పొందుతూ జీవిత భద్రత కల్పించుకోవాలని సూచించారు. సభకు కాలేషా జనరల్స్ అధినేత షేక్ కాలేషా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అమీన్, సుబాని, జానీ, హసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ అలవాటవుతుందని 23వ ఆంధ్రా బెటాలియన్ ఆర్మీ స్టాఫ్ సిహెచ్ ముర్మం పేర్కొన్నారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2021-22 సంవత్సరంలో ఎన్‌సిసి శిక్షణ పూర్తి చేసుకొని పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏ సర్టిఫికెట్‌ను అందజేశారు. సభకు ఎన్‌సిసి ఆఫీసర్ ఎ శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ రెండు సంవత్సరాల పాటు శిక్షణ పూర్తి చేసుకొని నూరు శాతం ఉత్తీర్ణత సాధించటం అభినందనీయమన్నారు. ఏ సర్టిఫికెట్ వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందని శ్రీమన్నారాయణ వివరించారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రాథమిక విద్యా అభివృద్ధిని ప్రోత్సహించేందుకు పట్టభద్రుల సంఘం ముందువరుసలో ఉంటుందని అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు అన్నారు. బుధవారం చల్లారెడ్డిపాలెం పంచాయతీ స్థానిక దత్తక్షేత్రం ఎదురు మండల పరిషత్ పాఠశాలలో చదువుకొంటున్న 90 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ, ఏకాగ్రత అలవర్చుకోవాలని సూచించారు. విద్యాభివృద్ధికి సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్, దత్తక్షేత్రం కన్వీనర్ కె ప్రమీలదేవి, రావి మస్తాన్‌రెడ్డి, జి శేఖర్‌బాబు, చుండూరి నాగాంజనేయులు, గోడపర్తి రామకృష్ణ, పూటుకూరి కోటిస్వామి,షేక్ ఖాదర్, బుర్ర సాంబశివరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులో మార్కెట్ వెనుక జండా చెట్టు బజారులో రహదారి పల్లం కావటంతో వర్షపు నీరు నిలబడి ప్రజలకు ఇబ్బంది కరంగా మారింది. దీంతో పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించి సిబ్బందితో రహదారిపై నిలిచిన నీటిని బయటికి తరలించారు. దీనితో భాగంగా పేరుకుపోయిన చెత్త చెదారాన్ని కూడా శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. ప్రజలు చెత్త కుండీలు, చెత్త బుట్టలు, వాహనాలను వినియోగించుకోవాలని సూచించారు.

నిజాంపట్నం తహశీల్దార్‌గా నెహ్రూ బాబు

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం మండల తహశీల్దార్‌గా కె నెహ్రూబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల జిల్లా పర్చూరు మండల తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై నిజాంపట్నంకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తహశీల్దార్ ఎం శిరీష బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్లారు.

వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే కరణం నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

ట్రాక్టర్‌తో పొలం పనులు చేసి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ తిరగబడి వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగింది. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోకల వెంకటేశ్వర్లు(65) తన సొంత పొలంలో దుక్కి దున్ని ఇంటికి వస్తున్న సమయంలో ఇటుక తయారీ కోసం మట్టి తవ్విన 15 అడుగుల గుంతలో ట్రాక్టర్‌తో సహ కింద పడిపోవడంతో ట్రాక్టర్ ఇంజన్ కింద పడి ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు పొలాల్లో వెతికారు. తన పొలం సమీపంలోనే ఈ ప్రమాదం సంభవించగా ప్రమాద ఘటనా స్థలానికి బంధువులు వెళ్లి ట్రాక్టర్‌ను పక్కకు నెట్టి మృతదేహాన్ని మంగళవారం రాత్రి బయటికి తీసి ఇంటికి తరలించారు.

ఎమ్మెల్యే కరణం నివాళి

తిమ్మాయపాలెం గ్రామానికి మూడు దఫాలుగా సర్పంచి పదవిని ఆయన కొనసాగించారని పాత రాజకీయ నాయకుని కోల్పోవడం బాధాకరమని కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. వెంకటేశ్వర్లు మతదేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బలరాం (ఇన్‌సెట్‌లో) వెంకటేశ్వర్లు

బాచిన కృష్ణ చైతన్య పరామర్శ

మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు మృతదేహాన్ని వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య స్వగ్రామంలో సందర్శించి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రమాద తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తోకల రాజేష్, మోటుపల్లి శ్రీనివాసరావు, కాకాని హనుమంతరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నేరాల నియంత్రణకు, నేర పరిశోధనకు సీసీ కెమెరాలు పాత్ర కీలకమైందని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. బుధవారం జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటు వాటి అవశ్యకత గురించి తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1348 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాపట్ల జిల్లా ఏర్పడక ముందు జిల్లాలో 562 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఏర్పడిన తరువాత గత సంవత్సరం జిల్లాలో 143 సీసీ కెమెరాలు, గడిచిన 6 నెలల కాలంలో 639 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లా పోలీస్ అధికారులు వారి వారి పోలీస్ స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన కూడళ్ళు, రహదారుల పై ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఏదైనా నేరం జరగకుండా ముందుగానే నియంత్రించడం కోసం, నేరం జరిగిన తర్వాత సంబంధిత నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలు, కూడళ్ళు, రద్దీ ప్రదేశాలలో నేరాలు జరగకుండా ఉండాలంటే ఆ ప్రాంతంలో సీసీ కెమెరా ఉండటం ఎంతో ఉపయోగమని, పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పరిశీలించడం వలన ముందస్తుగా నేరాలు జరగకుండా నియంత్రించవచ్చునని జిల్లా ఎస్పీ తెలిపారు. తప్పని సరిగా జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న జిల్లా పోలీసు అధికారులు

విత్తనాల షాపుల్లో అధికారులు తనిఖీ

ప్రజాశక్తి- పంగులూరు

నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను అరికట్టేందుకు, మండలంలోని అన్ని ఫెర్టిలైజర్ షాపుల్లో బుధవారం అధికారులు తనిఖీ చేశారు. ఈ కాలంలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు ఎక్కువగా వస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని, వాటిని నివారించేందుకు మండలంలోని నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను అరికట్టడం కోసం ఫెర్టిలైజర్స్ షాపుల్లో రేణింగివరం ఎస్ఐ తిరుపతిరావు, పంగులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పంగులూరు, ముప్పవరం, చందలూరు, మొదలైన గ్రామాల్లో ఈ తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. అన్ని సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు గాని, నకిలీ ఎరువులు గాని అమ్మకాలు జరిగితే షాపు యజమానులను కఠినంగా శిక్షిస్తామని, ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతిరావు చెప్పారు.

కౌలు రైతు కార్డులు వినియోగించుకోండి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

కౌలు రైతు కార్డుల ద్వారా అత్యధిక ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని కౌలు రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిడిఎం విజయనిర్మల రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పొన్నపల్లి, నడింపల్లి గ్రామాలలో కౌలు రైతు కార్డుల ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం నుంచి కోఆర్డినేటర్ ఓబయ్య, డిడిఏ, డాక్టర్ సురేఖదేవి పాల్గొని అధికారుల గురించి అవగాహన కార్యక్రమం, మరియు ఖరీఫ్ సాగు ప్రణాళికలో భాగంగా పచ్చిరొట్ట ఎరువు ప్రాధాన్యత, విత్తనాల ప్రాముఖ్యత, విత్తనశుద్ధి, నీటి యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి టి బాలాజీ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సౌకర్యాలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరి పేట, రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు మరియు పాఠశాల కరస్పాండెంట్ సహకారం తో నిర్మించిన మరుగుదొడ్ల సముదాయాన్ని, ఆర్వో ప్లాంట్, హ్యాండ్ వాష్ విభాగాలను రోటరీ డిస్టిక్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ సేవా రంగంలో ముందుంటున్నదని అన్నారు. ఈ కార్యక్రమం లో మార్టూరు, చిలకలూరిపేట, పండరీపురం రోటరీ క్లబ్ అధ్యక్షులు మరియు సెక్రటరీలు, పాఠశాల కమిటీ ప్రెసిడెంట్ బొగ్గవరపు చెంచు పున్నయ్య, కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గోరంట్ల పృథ్వీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లు తట్టుకునే విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి-చీరాల

మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీ, పలు గ్రామాలలో మల్లెపూల తోటలు తెగుళ్ల బారిన పడి పంట నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారని, తెగుళ్ల తట్టుకునే విత్తనాలను పంపిణీ చేయాలని కోరుతున్నారని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి అన్నారు. మల్లెపూల తోటల తెగుళ్ళ బారినపడి పూర్తిగా పాడవుతున్నాయని రైతులు ఆర్‌బికెలో ఫిర్యాదు చేయడంతో అధికారులు బుధవారం వాటిని పరిశీలించారు. మల్లెపూలు కావూరివారిపాలెం, పక్కన గ్రామాల కుటుంబాలు పూర్తిగా వీటిపైన ఆధారపడి జీవనాధారంగా ఉంటున్నారని అన్నారు. ఈ ప్రాంతం నుంచి మల్లెపూలు హైదరాబాద్, ఒంగోలు, గుంటూరు, వంటి మహానగరాలకు సప్లై చేసేవారని అయితే ప్రస్తుతం ఈ చుట్టుపక్కలకే సరిపోయే పరిస్థితి లేదన్నారు. తెగులు తట్టుకునే విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు అందించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికే అధికారి ఎమెలియా పాల్గొన్నారు.

మార్టూరు తహశీల్దార్‌గా సురేష్‌బాబు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

మార్టూరు తహశీల్దార్‌గా పి సురేష్ బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం డి సెక్షన్‌లో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు ఇటీవల తహశీల్దార్‌గా పదోన్నతి పొంది మార్టూరు మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌గా నియమితులయ్యారు.

ఆర్థిక విద్యపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి బాపట్ల

విద్యార్థుల్లో ఆర్థిక విద్య పట్ల మరింత అవగాహన కల్పించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో బాపట్ల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయిలో పలు పాఠశాలల విద్యార్థులకు పట్టణంలోని ఏబిఎం పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు బాపట్ల జిల్లాలో 25 మండలాల నుంచి ఆయా మండలాలలో ప్రథమంగా నిలిచిన పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో కర్లపాలెం మండలం చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వై సిరి, పి శైలుశ్రీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రూ.పది వేల నగదు బహుమతిని విజేతలకు అందజేశారు. రెండో స్థానంలో అద్దంకి మండలం తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్వీ పార్థసాయి, ఎఎస్ఎస్ సూర్య తేజ ద్వితీయ బహుమతి రూ.7 వేల 5 వందలు నగదు బహుమతి కొరిశపాడు మండలం రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి లలిత శ్రీ, జి హర్షిత బృందం తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ డి వెంకటేశ్వర్లు, బాపట్ల ఉప విద్యాశాఖ అధికారి జి వెంకటేశ్వర్లు జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్ పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులను బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ పివిజె రామారావు అభినందించారు.

పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గ్రామ సర్పంచి విజయ అధ్యక్షతన బుధవారం జరిగింది. గ్రామంలో ఉన్న చేపల చెరువులు రెన్యువల్ చేయాలని కోరడంతో తీర్మానం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బి మల్లికార్జునరావు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ డి కృష్ణ పాల్గొన్నారు.

చెరుకుపల్లి తహశీల్దార్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లి తహశీల్దార్‌గా బి వెంకటేశ్వర్లు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గుంటూరు జిల్లా తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై చెరుకుపల్లి వచ్చారు. ఇప్పటివరకు రేపల్లె తహశీల్దార్ డి మల్లికార్జునరావు చెరుకుపల్లి తహశీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ప్రజా సమస్యల పట్ల, రెవెన్యూ సమస్యల పట్ల పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ టి నిరంజన్ బాబు, మండల సర్వేయర్, సిబ్బంది ఆయనను కలిసి అభినందించారు.

గోలి లక్ష్మయ్య సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డిసిఆర్‌బి డిఎస్పీ గోలి లక్ష్మయ్యను సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

శాంతిభద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో బాపట్ల డిసిఆర్‌బి డిఎస్పీ గోలి లక్ష్మయ్య అందించిన సహకారం మరువ లేనిదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీలలో బాపట్ల డిసిఆర్‌బి డిఎస్పీ గోలి లక్ష్మయ్య గుంటూరు ఇంటెలిజెన్సీ విభాగానికి బదిలీపై వెళుతున్నందున బుధవారం జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ అధికారులు డిఎస్పీకి వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడారు.

ముస్లిములకు గొట్టిపాటి బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తి భావం, కరుణ, సహనాన్ని బక్రీద్ చాటి చెబుతుందని అన్నారు. త్యాగానికి ప్రతీకగా ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటారన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలు, విధానాలు అందరికీ అనుసరణీయమైనవని తెలిపారు. బక్రీద్ దేవుని పట్ల సంపూర్ణ భక్తి భావం, పేదల పట్ల సాయం, ఇతరుల పట్ల సోదర భావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. అందరికీ ఆ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

టాయిలెట్లు ప్రారంభం

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని ముప్పవరం గ్రామంలో పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాలలో బుధవారం టాయిలెట్లను మండల విద్యాశాఖ అధికారి-2 గోగుల వీరాంజనేయులు ప్రారంభించారు. ఈ టాయిలెట్లను సుమారు 13 లక్షల రూపాయల వ్యయంతో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, ముప్పవరం ఉన్నత పాఠశాల 1988-89 సంవత్సరపు 10వ తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించారు. బాలురకు నాలుగు, బాలికలకు నాలుగు టాయిలెట్లను అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. బాలుర టాయిలెట్లను, హ్యాండ్ వాష్ను మండల విద్యాశాఖ అధికారి వీరాంజనేయులు ప్రారంభించారు. బాలికల టాయిలెట్లను రోటరీ గవర్నర్ టి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి ప్రసాద్, రోటరీ ప్రతినిధులు రత్న ప్రభాకర్, ఇంటూరి ఆంజనేయులు, గరిమిడి జగన్మోహన్‌రావు, పాఠశాల సిబ్బంది, పాఠశాల పాలకవర్గం పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రజలతో మోపిదేవి

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం చెరుకుపల్లి పట్టణంలో మొదటిరోజు గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరిస్తామని మోపిదేవి ప్రజలకు హామీ ఇచ్చారు. నవరత్నాలు పథకాలు ప్రజలకు వివరించి తమకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్న ప్రసాద్, జడ్పిటిసి మర్రివాడ వెంకట పావని ప్రసాద్, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, బండారు రామారావు, గ్రామ సర్పంచ్ దేవరకొండ వాణి, రావూరి శివ నాగేశ్వరరావు, తూము నాగ కోటేశ్వరరావు, ఎమ్మెస్సార్ తదితరులు పాల్గొన్నారు.

పనులను వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి-సంతమాగులూరు

అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను వెంటనే చేపట్టాలని ప్రజా ప్రతినిధులు ఎంపీడీవో జీ లక్ష్మీదేవిని డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీపీ ఎనుబర్ల ఎలమంద అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు మాట్లాడారు. ఏల్చూరు గ్రామంలో మూడు సంవత్సరాల క్రితమే పదకొండు అంగన్‌వాడీ సెంటర్స్‌కు గాను ఎనిమిది బిల్డింగులు శ్లాబ్ మట్టానికి నిర్మించి ఇప్పటివరకు అసంపూర్తిగానే నిర్మాణాలు నిలిచిపోయాయని అన్నారు. పసి బిడ్డలు కూర్చోవలసిన చోట, పశువులను కట్టి వేస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు ఒరుగంటి కోటిరెడ్డి ఆరోపించారు. అలాగే ఏల్చూరు హిందూ పాఠశాల, వెల్లలచెరువు హెచ్ఈ పాఠశాలల్లో స్లాబ్ పైపెచ్చులు ఊడిపోయి, ఇనుప చువ్వలు వేలాడుతూ ఎప్పుడు కూలిపోతాయో తెలియదని వెంటనే ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రైవేటు బిల్డింగుల్లోకి మార్చాలని, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు ఎంఈఓ కోటేశ్వరరావుని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నందున రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రసీదు పొందాలన్నారు. ఎంఈఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ఈ యేడాది పదో తరగతిలో విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టీ ప్రశాంతి, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యలో.. నూతన సంస్కరణలకు శ్రీకారం: మోపిదేవి

ప్రజాశక్తి-రేపల్లె

అమ్మఒడి నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మోపిదేవి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల తలరాతలు మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టిందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ అన్నారు. పట్టణంలోని సీతారామ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అమ్మఒడి నిధుల పంపిణీ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ విద్యకు పేద రికం అడ్డుకాకూడదని భావించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పేద విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదని, విద్యార్థులకు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. చదువుకునే విద్యార్థులు చిరిగిన బట్టలు, అరిగిన చెప్పులు, తెగిన బ్యాగులతో ఉండకూడదనే సంకల్పంతో జగనన్న విద్యా కానుక కిట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ పిల్లలు తమ కంటే గొప్పగా ఎదగాలనే తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా చదువుకునే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు అమ్మఒడి పథకం ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. నాలుగు సంవత్సరాల పాలనలో అనేక మార్పులను తీసుకువచ్చినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనా తరగతులు ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పిజె రామారావు, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఆర్డీవో జగన్నాథం పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ విజయ్ సారథి, చైర్మన్ కట్టా మంగ, మండల విద్యాశాఖ అధికారులు నవీన్ కుమార్, శ్రీహరి, సురేష్, శ్రీధర్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు గడ్డ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యే శ్రీ చైతన్య లక్ష్యం

ప్రజాశక్తి-కొల్లూరు

శ్రీ చైతన్య విద్యా విహార్

క్రమశిక్షణ విలువలతో కూడిన విద్య అందించి ఉన్నత లక్ష్య సాధనే శ్రీ చైతన్య విద్యా విహార్ ముఖ్య ఉద్దేశమని కరస్పాండెంట్ పి వెంకటేశ్వర రావు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యారంగంలో నిర్మాణాత్మక బోధనతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. కొల్లూరు పట్టణంలో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, ఎటువంటి శబ్ద కాలుష్యం లేని ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థ తమదని అన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు కే భాష్యంత్ 584, వి కౌశిక్ 580, పి శ్రీ సత్య శ్రావణి 572 మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు. అంకిత భావంతో కూడిన అనుభవజ్ఞులైన తమ ఉపాధ్యాయులు అనుసరిస్తున్న విద్యా విధానాలు విద్యార్థుల ఉన్నతికి దోహద పడుతున్నాయని అన్నారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్నామని వెల్లడించారు. విద్య వ్యాపారంగా కాకుండా ఉన్నత విలువలు తెలియజేసే విధంగా, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా భవిష్యత్తును తీర్చిదిద్దటమే తమ ముఖ్య ఉద్దేశమని ఆయన చెప్పారు.

ఆదర్శవంతమైన విద్యా సంస్థ 'హార్వెస్ట్ ఇండియా'

ప్రజాశక్తి-భట్టిప్రోలు

హార్వెస్ట్ ఇండియా విద్యా సంస్థ గ్రామీణ ప్రాంతంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తోంది. హార్వెస్ట్ ఇండియా ద్వారా నడపబడుతున్న విద్యా సంస్థలలో భట్టిప్రోలు కెవిఎస్‌కె కళాశాలలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇక్కడ 1993లో బాలికల జూనియర్ కళాశాల, 2008లో బాలికల డిగ్రీ కళాశాల, 2016లో బిఇడి కళాశాలలు ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి అత్యుత్తమ విద్యా బోధనతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఆదర్శ విద్యా సంస్థలు కెవిఎస్‌కె అని కరస్పాండెంట్ కె సురేష్ కుమార్ తెలిపారు. ఇంటర్‌లో ఎంపిసి, బైపీసీ, సిఇసి, హెచ్ఈసి గ్రూపులలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం, డిగ్రీలో బిఎస్‌సి కంప్యూటర్స్, జువాలజీ, బోటనీ, మాథ్స్ వంటి కోర్సులు, బిఏ, బికాం జనరల్ సబ్జెక్టులలో ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు

ఈ ఏడాది జరిగిన పబ్లిక్ పరీక్షలలో డిగ్రీ ఫలితాలలో బిఎస్సి (ఎంపిసి.కం) 2595/2800, 2592/2800లతో ప్రథమ, ద్వితీయ స్థానాలు, ఎంపిసిలో 2445/2800, బిజెడ్‌సి 2683/3150, 2670/3150 మార్కులు లభించాయన్నారు. అలాగే సీనియర్ ఇంటర్‌లో ఎంపిసి (ఇఎం) 965/1000, ఎంపిసి (టి.ఎం), 921/1000, సిఇసిలో 953/1000 మార్కులు లభించాయన్నారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపిసి(ఇఎం) 447/470, బైపిసి (ఇఎం) 408/440, సిఇసిలో 385/500 మార్కులతో ఉత్తమ ఫలితాలు లభించాయన్నారు.

ఇష్టంతో చదవాలి: డాక్టర్ బాబూరావు

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులు చదువులను కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని రోటరీ అధ్యక్షులు డాక్టర్ ఐ బాబూరావు అన్నారు. బుధవారం వైకుంఠపురంలోని పిచ్చిగా ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో రోటరీ అన్నివేళలా ముందుంటుందని, అందులో భాగంగా ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు సుమారు రూ10,500 విలువగల నోట్ పుస్తకాలను వంద మంది విద్యార్థులకు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల వెంకటేశ్వర్లు, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, డివి సురేష్, టి లక్ష్మి ప్రతాప్, జివై ప్రసాద్, ఎస్‌వి స్వామి, కరస్పాండెంట్ వి ప్రభాకరరావు, హెడ్మాస్టర్, బి శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, బాల బాలికలు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన విద్యే ధ్యేయం

బ్రదర్ కిరణ్ కుమార్, ప్రిన్సిపల్, మోంట్ ఫోర్ట్ హైస్కూల్

ప్రజాశక్తి-రేపల్లె: ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన విద్య అందిస్తూ ప్రణాళికా బద్ధమైన ఒత్తిడిలేని విద్యా విధానాన్ని అధిగమించడం ద్వారా తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు మోంట్ ఫోర్ట్ హైస్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్‌కుమార్ తెలి పారు. తమ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో విజయదుందుభి మోగించినట్లు ఆయన తెలిపారు. పి. సనాఅజామి 584, ఎస్‌కె జావీద్ అహ్మద్ 580, వై సిరివెన్నెల 576, కె స్మిత 576, సయ్యద్ రెహానా 576, ఎస్‌కె అమీన్ కాశీపా 576, ఎస్‌కె రీనా సమ్రీన్ 575, టి రంజని 569 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. తమ పాఠశాల పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆత్మబంధువు అని తెలిపారు. తమ విద్యార్థులు మార్కులు సాధించడంలో కష్టంతో బాటు ఇష్టాన్ని క్రమేపీ పెంచుకుంటున్నారని తెలిపారు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ మార్కుల సాధన కోసం తమ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల మాదిరిగానే నిజజీవితంలో కోడింగ్ లాంగ్వేజ్ పాత్ర అత్యంత కీలకంగా మారినట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో మూడు దశాబ్దాలుగా నూరు శాతం ఫలితాలు సాధిస్తూ మోంట్‌ఫోర్ట్ హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రుల హృదయాల్లో స్థానాన్ని పదిలం చేసుకున్నట్లు తెలిపారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుం టూ వారిలో నైపుణ్యతను పెంచేందుకు తమ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. తమ యందు నమ్మకం ఉంచి, సహాయ సహకారాలు అందిస్తున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

వామపక్షాల కరపత్ర ప్రచారం

ప్రజాశక్తి-అద్దంకి

సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపైన కరెంటు అధిక బిల్లుల భారాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రాజీవ్ కాలనీలో కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అదాని లాంటి కంపెనీలకు లాభాలు చేకూర్చే విధానాల్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని అన్నారు. సర్దుబాటు సర్ చార్జీలు పేరుతో 2014లో వాడుకున్న కరెంటుకు అదనపు చార్జీలు పేరుతో రకరకాల పేర్లతో ప్రజలపైన కరెంట్ బిల్లులు భారాలు వేస్తున్నా యని అన్నారు. విద్యుత్తు భారాలను వ్యతిరేకిస్తూ మరొక విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కెఎల్‌డి ప్రసాద్, సిపిఎం నాయకులు జి వెంకట్రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వామపక్షాలతో జై భీమ్ భారత్ పార్టీ ఐక్య ఉద్యమాలు

ప్రజాశక్తి-రేపల్లె

గడప గడపకూ దగా ప్రభుత్వం కరపత్రాలు చూపుతున్న నాయకులు

వామపక్ష పార్టీలతో కలిసి ప్రజా సమస్యలపై పోరాడేందుకు జై భీమ్ భారత్ పార్టీ సంసిద్ధంగా ఉందని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, బాపట్ల జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రాంజీ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ జై భీమ్ భారత్ పార్టీ చేపడుతున్నటువంటి గడప గడపకూ దగా ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి చిక్కాల మణిలాల్, సిపిఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి నాగాంజనేయులును కలిసి 'గడప గడపకూ దగా ప్రభుత్వం' కరపత్రాలు అందించినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల ప్రతినిధులు మేధావి వర్గం కలిసి పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ అధినేత జడా శ్రావణ్ కుమార్ చేపడుతున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాల గురించి ప్రతి ఒక్కరికీ వివరిస్తామని చెప్పారు. 2024 ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో జై భీమ్ భారత్ పార్టీని సముచిత స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు, రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబూరావు, నెరసు వెంకటరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున
- అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదు..
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జడ్పీ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యాశాఖ, ఎపిసిపిడిసిఎల్, హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను అధిగమించి ముందుకు సాగాలని సూచించారు. ప్రజాప్రతినిధుల మాటను అధికారులు తీసుకొని ముందుకు సాగాలన్నారు. అందరి సహకారంతో జిల్లా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

పాఠశాలల స్థలాలు అన్యాక్రాంతం కానీయొద్దు

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఆయా పాఠశాలల స్థలాల డిజిటల్ డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ఇందుకు జడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయాలన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి

పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటిసిలు, ఎంపిపిలు డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని దుయ్యబట్టి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే పనులు విద్యుత్ శాఖ అధికారులు మానుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటిసిలు సూచించారు.

అధికారులు ప్రోటోకాల్ పాటించట్లేదు

జడ్పీటిసిలు, ఎంపిపిల విషయంలో అధికారులు ప్రోటోకాల్ పాటించటం లేదని, త్రిపురాంతకం జడ్పీటిసి మాకం జాన్‌పాల్, కొమరోలు ఎంపిపి కె.అమూల్య సమావేశం దృష్టికి తెచ్చారు. పదే పదే ప్రోటోకాల్ పాటించాలని అడుక్కోవాల్సి వస్తుందని వాపోయారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులైన జడ్పీటిసిలు, ఎంపిపిలకు అధికారులు ప్రోటోకాల్ పాటించాలన్నారు. ప్రోటోకాల్ పాటించటం లేదని ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి జిల్లా అభివృద్ధికి అధికారులు సహకరించాలని తెలిపారు.

ఖాళీ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ

జిల్లాలోని వివిధ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరిస్తామన్నారు. హౌసింగ్ బిల్లుల కోసం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎవరైనా డబ్బులు అడిగినట్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, కందుకూరు, గిద్దలూరు, సంతనూతలపాడు, చీరాల ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్ రెడ్డి, అన్నా రాంబాబు, టిజెఆర్ సుధాకర్ బాబు, కరణం బలరామకృష్ణమూర్తి, ప్రకాశం జెసి కె.శ్రీనివాసులు, బాపట్ల జెసి సిహెచ్ శ్రీధర్, నెల్లూరు జడ్పీ సిఇఒ బి.చిరంజీవి, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ మాదాసి వెంకయ్య, వివిధ శాఖల అధికారులు, జడ్పీటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

'అమ్మ ఒడి'తో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులు 'అమ్మ ఒడి' వంటి గొప్ప పథకాలను ఉపయోగించుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున ఆకాంక్షించారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగో విడత జగనన్న అమ్మ ఒడి నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని కురుపాకంలో ప్రారంభించారు. ఇందుకు అనుబంధంగా కలెక్టరేట్లోని స్పందన హాలులో రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, మాదిగ కార్పోరేషన్ ఛైర్మన్ మనకారావు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతతో కలిపి ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును ఆయన అందజేశారు.

చెక్కు అందజేస్తున్న మంత్రులు, కలెక్టర్

305 కోట్లు తల్లుల ఖాతాలకు జమ

అమ్మ ఒడి పథకం కింద జిల్లాలో 2,03,663 మంది తల్లుల ఖాతాలలో రూ.305.49 కోట్లను జమ చేస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని చెప్పిన తేదీ తప్పకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తల్లులు ఈ నగదును స్వంత అవసరాలకు వాడకుండా కేవలం విద్యకు సంబంధించిన అవసరాలకే వినియోగించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఇంగ్లీష్ మీడియం ప్రాముఖ్యతను గుర్తించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, జడ్పీ విద్యాధికారి సామా సుబ్బారావు, ఉప విద్యాధికారి అనితా రోజ్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

సాధారణ విద్యార్థులతో

అసాధారణ ఫలితాలు

విజ్ఞాన భారతి హైస్కూల్ సెక్రటరీ ,కరస్పాడెంట్ షేక్ జమీర్, పఠాన్ అసిఫా

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

సాధారణ విద్యార్థులతో తాము అసాధారణ ఫలితాలు సాధిస్తున్నట్లు అమ్మనబ్రోలు విజ్ఞాన భారతి హైస్కూల్ సెక్రటరీ ,కరస్పాడెంట్ షేక్ జమీర్, పఠాన్ అసిఫా తెలిపారు. అమ్మనబ్రోలు వ్యవసాయ ఆధారితం ప్రాంతమని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు నిరంతరం పనుల కోసం పరుగులు దీస్తూ ఉంటారని తెలిపారు. తమ పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించే స్థితిలో ఉండరని తెలిపారు. అయినప్పటికీ వారి ఆశయాలను

వమ్ముచేయకుండా వారిపిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ వారి ఉన్నతికి శ్రమిస్తున్నామన్నారు. 2023 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో లీలా అలేఖ్య 541 మార్కులు, బి.కష్ణకుమార్ 515 మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ విజయానికి సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులకు ఈ సందర్భంగా బక్రీదు శభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-దర్శి

ఉపాధి పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జలశక్తి అభియాన్ డైరెక్టరు మనోజ్‌భావన, ప్రాజెక్ట్ డైరెక్టరు శ్రీనారెడ్డి తెలిపారు. తాళ్ళూరు మండల పరిధిలోని నాగంబొట్లపాలెం, తాళ్ళూరు గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మురళి, సర్పంచులు చార్లెస్ సర్జన్, చిమటా సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మినారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

తహశీల్దారుగా సీతారామయ్య

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు తహశీల్దారు సీతారామయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కషి చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అదేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా తహశీల్దారును విఆర్ఎల జిల్లా నాయకులు ఓర్సు ఆంజనేయులు, చేబోలు శ్రీనివాసులు, సంకుల అల్లూరయ్య, పిక్కిలి వెంకటయ్య, రామయ్య తదితరులు అభినందించారు.

పొదిలి తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి తహశీల్దారుగా అశోక్ కుమార్ రెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. అందులో భాగంగా ఎన్‌జిఒ సంఘం నాయకులు బుధవారం తహశీల్దారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ పొదిలి తాలూకా యూనిట్ అధ్యక్షుడు నారు శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి షేక్ నాగూర్ వలి, గౌరవాధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహిమాన్, ఉపాధ్యక్షుడు షేక్ కరిముల్లా, షేక్ అబ్దుల్ ఆరీఫ్, సిహెచ్. వెంకటేశ్వర్లు, నాగేంద్రం, మహిళా వింగ్ అధ్యక్షురాలు ఎం. పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాఘవులుకు వరికూటి నివాళి

ప్రజాశక్తి-సింగరాయకొండ

శింగరాయకొండ మండలం ఊళ్ళపాలెం పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన సాక్షి దినపత్రిక ఎడిటర్ నూతలపాటి శ్రీనివాసులు తండ్రి నూతలపాటి రాఘవులు అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు , వైసిపి నాయకులు తదితరులు రాఘవులు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళు లర్పించిన వారిలో వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్‌రెడ్డి, ముళ్ళపూడి సత్య నారాయణ, పాకనాటి సుబ్బారెడ్డి ఉన్నారు. అదేవిధంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకటసుబ్బారావు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బత్తిన రాజేష్ రాఘవులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దర్శి మండలం దేవవరం పంచాయతీ పరిధిలోని కట్టు బడివారిపాలెం జనరల్ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఒకే ఒక విద్యార్థి మిలిగాడు. ఆ విద్యార్థికి ఏకోపాధ్యాయుడు కోసూరి శ్రీనివాసరావు చదువు చెబుతున్నాడు.

ప్రకాశం-దర్శి

సాగర్ జలాల మళ్లింపు పథకానికి నేడు శంకుస్థాపన

ప్రజాశక్తి-పొదిలి

ప్రజాశక్తి **కథనానికి స్పందన**

ఫ్లోరైడ్ నీటితో పొదిలి ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. గుక్కెడు మంచినీటి కోసం నానా అవస్థలు తప్పడం లేదు. గతంలో ఎన్ఎపి(నెదర్లాండ్ ఎయిడెడ్ ప్రాజెక్టు) పథకం ద్వారా అందిస్తున్న నీరు పెరిగిన జనాభా దాహార్తిని తీర్చేందుకు సరిపోవడం లేదు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా అడుగంటి పోయాయి. ఈ నేపత్యంలో పొదిలి చెరువులను సాగర్ జలాలలో నింపి తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు గత ప్రభుత్వ హయాంలో చేసిన ప్రతిపాదనలు ఆమోదం దశలోనే ఆగిపోయాయి. ఆర్థికంగా అనుమతి మంజూరు కాలేదు. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పొదిలికి వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఐదు సంవత్సరాల తర్వాత ప్రజల కోరిక నేరవేరనుంది. ఇటీవల మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సాగర్ జలాల మళ్లింపు పథకం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న పజాశక్తి దిన పత్రికలో పొదిలి ప్రజల దాహార్తి తీరేది ఎలా ? అనే శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికార పార్టీ నాయకులు నేడు మరోసారి శంకుస్థాపనకు ఏర్పాటు చేశారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరంలో భవిష్యత్‌కు గ్యారెంటీ మినీ మేనిఫెస్టో ప్రచార కార్యమ్రాన్ని శ్రేణులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే , టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. సంక్షేమం పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాసంక్షేమం మరిచిన వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, బేరి పుల్లారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

టంగుటూరు : టంగుటూరు పంచాయతీ పరిధిలోని రోడ్లపై వర్షపు నీరు, నివాసా ల్లోని వాడుక నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇఒపిఆర్‌డి నర్రా జగదీష్ బాబు, టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత తెలిపారు. గత పది రోజులుగా పంచాయతీకి సంబంధించిన జెసిబితో శివారు కాలనీలు, అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్ల తొలగిస్తున్నట్లు తెలిపారు. స్థానిక బస్ స్టాప్ సెంటర్‌లో డ్రైనేజీలో పూడిక తీత పనులను బుధవారం నిర్వహించారు. ఈ పనులను సర్పంచి మద్దిరాల మమత, పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ బాబు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు.

పుస్తకాలు అందజేత

తర్లుపాడు : మండల పరిధిలోని లక్ష్మక్కపల్లెలోని ఎంపిపి స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ప్రధానో పాధ్యాయుడు కశ్శెట్టి జగన్‌బాబు నోట్‌పుస్తకాలు, పెన్నులు బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు.

అభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి-దర్శి

నగరపంచాయతీ అభివృద్ధికి కౌన్సిలర్లు పాటుపడాలని నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య కోరారు. నగరపంచాయతీ సర్వసభ్య సమావేశం చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ వై. మహేష్ మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా కౌన్సిలర్లు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు చేయాలి

జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు మండలానికి జూనియర్ కాలేజి మంజూరు చేయాలని జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. ఒంగోలులో జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటనాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కాలేజి లేక విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురికావాల్సివస్తుందన్నారు. కురిచేడులోని ఎస్‌సి హాస్టల్ అనేక సంవత్సరాలుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన

భవనాన్ని నిర్మించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలిగించి వాటి స్థానాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈమేరకు జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ధర్నాను జయప్రదం చేయాలి : సిపిఎం

తర్లుపాడు : విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ ఈ నెల 30న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లానాయకుడు గుమ్మా బాలనాగయ్య కోరారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల నాగయ్య మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సర్దుబాటు ఛార్జీల భారం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యేర్వ పాపిరెడ్డి, జమ్ముల నాగరాజు, బ్రహ్మారెడ్డి, ఎస్.పాపయ్య, అల్లూరయ్య, కాకర్ల కాశీం, వై.చిన్న వెంకటరెడ్డి, ఎం.అల్లూరయ్య పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సాయం అందజేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి

ప్రజాశక్తి-మద్దిపాడు

పంటలు సాగు చేసే ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి రూ. 10 వేల వంతున ఆర్థిక సాయం అందజేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రాచవారిపాలెం, కీర్తిపాడు, మల్లవరం, గుండ్లపల్లి, దొడ్డవరం తెల్లబాడు నేలటూరు, పెదకొత్తపల్లి, లింగంగుంట, మండవారి పాలెం గ్రామాలలో రైతు సంఘ ప్రతినిధులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పంటలు సాగు చేసే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హను మారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు పూర్తి అశాస్త్రీయంగా ఉన్నాయన్నారు. వ్యవసాయం చేసే వారిలో సన్న, చిన్నకారు కౌలు రైతులు అధికంగా ఉన్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు ఎపి రైతు సంఘం సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కె. వీరారెడ్డి మాట్లాడుతూ రెండు ఎకరాలు సాగు చేసే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుంచి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జులై 3న గ్రామ సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రం అందజేనున్నట్లు తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు వాసు, సుబాబుల్ -జామాయిలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తోట్టెంపూడి వెంకట శేషారావు, రైతు సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, అంజయ్య, శేషయ్య, తిరుపతయ్య శేషయ్య లక్ష్మయ్య పాల్గొన్నారు.

రిలే దీక్షల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ చేపట్టనున్న రిలే దీక్షలకు సంబంధించిన కరపత్రాన్ని సిపిఐ నాయకులు అందే నాసరయ్య, బహుజన సైన్యం అధ్యక్షుడు జనుమాల నాగయ్య, బిఎస్‌పి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంద్ర పాటి కాలేబు బుధవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా బహుజన సైన్యం అధ్యక్షుడు జనుమాల నాగయ్య మాట్లా డుతూ అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించలేక పోవడం ఈ ప్రభుత్వానికి దళితుల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్ధ మవుతుందన్నారు. దళితులు సిగ్గుతో తలదించు కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అనేక సంవత్సరాలుగా సామాజిక భవనం కోసం పోరా టాలు, రిలే దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సిపిఐ నాయకులు అందే నాసరయ్య మాట్లాడుతూ మార్కాపురంలో అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించలేకపోవడం దుర్మార్గమన్నారు. ఈ క్యార్యక్రమంలో బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంద్రపాటి కాలేబు. ఎనిబెరకిషోర్,గురవయ్య, నూతలపాటి రాజు,కుమార్, రామాంజ నేయులు చిన బాబు,తిమోతి, చెన్నకేశవులు, నాసరయ్య పాల్గొన్నారు.

రాచర్ల ఎస్ఐగా కృష్ణ పావని

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల ఎస్ఐగా కష్ణ పావని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మహేష్ గిద్దలూరుకు బదిలీ అయ్యారు .ఆయన స్థానంలో కృష్ణపావని బాధ్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణపావని మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు.

కొలుకులలో 'బడిబాట'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని కొలుకుల, వాదంపల్లి గ్రామాలలో షార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలు నాయక్, షార్డ్స్ సంస్థ ఎపిఎం మరియబాబు, ఎంఅండ్ఇ భాగ్యలక్ష్మి, సిఎఫ్‌సి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ నిధి అందజేత

ప్రజాశక్తి-వెలిగండ్ల

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ చేపట్టిన పోలవరం పోరుకేక, మహా పాదయాత్రకు సంఘీభావ నిధిగా రూ.600 అంగన్‌వాడీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముక్కు మహాలక్ష్మమ్మ, అనిశెట్టి నారాయణమ్మ, గూడూరు సలోమి, గడ్డం తిరుపతమ్మ, సిఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, కార్యాలయం సిబ్బంది సామేలు, రసూల్, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై సమీక్ష

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల పరిధిలోని పి.రాళ్లపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష పథకంపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ పొల్ల సుబ్రహ్మణ్యం, వైసిపి మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపిటిసి గిద్దా బ్రహయ్య, సర్పంచి జేమ్స్, వైసిపి నాయకులు నాగూర్, ఆదిరెడ్డి, ఎలికా రమణయ్య, ఎలికా నారాయణ, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే

ఎఫ్‌పిజి గ్రూపుల లక్ష్యం : ఎఒ

ప్రజాశక్తి-వెలిగండ్ల

మాట్లాడుతున్న ఎఒ రంగకృష్ణ

రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ఎఫ్‌పిజి గ్రూపుల యొక్క లక్ష్యమని ఎఒ రంగకష్ణ తెలిపారు. మండలంలోని మొగల్లూరు, గోకులం గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల గ్రూపులకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పది మంది రైతులు ఓ గ్రూపుగా ఏర్పాటు కావాలన్నారు. ఆ విధంగా ప్రతి గ్రామంలో 10 నుంచి 15 గ్రూపులుగా ఏర్పడితే వారికి ఎఫ్‌పిజి గ్రూపులు విత్తనం నుంచి పంట కోత వరకు సాంకేతిక పరిజ్ఞానం, సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేసి, దిగుబడులను పెంచి, మంచి మార్కెట్ సౌకర్యం కల్పించి రైతులను ఆర్థికంగా బలపరిచేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎఒలు వి. వెంకట శేషమ్మ, ఎ. శైలజారాణి, మొగులూరు, గోకులం సర్పంచులు మోపూరి లక్ష్మి, చిలకల వెంకటరత్నమ్మ, ఎపిఎం ఎన్.లక్ష్మీనారాయణ, హెచ్ఒ అంజలిభాయ్, మండల రైతు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు పాణ్యం మురళి, వెలుగు సిసిలు షేక్.జఫ్రుల్లా, జె.అచ్చయ్య, సునీత, ఈశ్వర్‌రెడ్డి, అజారుద్దీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ నాయక్‌కు సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం–2 ఎంఇఒగా నియమితులైన మల్లు నాయక్‌ను కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం శాలువా, పూలమాలలు, మెమెంటోలతో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ షరీఫ్, స్కూల్ ఇన్‌ఛార్జి రెహమాన్, ఉపాధ్యాయులు గౌస్, కిరణ్ బాబు, కృష్ణ కుమారి, ఈశ్వరి, ప్రీతి, స్వప్న, అరిపున్నిస్సా, రమాదేవి, బాలకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే టెండర్ల ప్రక్రియ

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రభుత్వ నిబంధనల మేరకే పారదర్శకంగా టెండర్ల ప్రక్రియను నిర్వహించినట్లు సర్పంచి నర్రా శైలుషా, ఉపసర్పంచి మొలకలపల్లి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వెల్లడించారు. మండల పరిధిలోని సూరారెడ్డిపాలెంలో 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ పారిశుధ్య కార్మికుల విధి నిర్వహణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. 7 పోస్టులకు సంబంధించి తక్కువ కోడ్ చేసిన బెజవాడ శ్రీనివాసరావుకు 6 పోస్టులు, మిగిలిన 1 పోస్టు మొలకలపల్లి సురేంద్రకు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నర్రా శైలుషా, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలంకేశ్వరుని తిరునాళ్ల

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్వామి వారి మూలవిరాట్టు

నల్లమల అటవీ ప్రాంతంలో పాలుట్ల సమీపంలోనున్న వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి తిరునాళ్ల తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పాలంకలో గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. కృష్ణానది ప్రక్కన శ్రీశైలానికి ఉత్తర భాగాన పెద్ద కొండ చరియ క్రింద పాలంక స్వామి వెలిశారు. ఈ క్షేత్రంలో గణపతి, పంచముఖ బ్రహ్మ ఆలయాలు ఉన్నాయి. సంతాన ప్రాప్తి కోసం భక్తులు ఈ ఆలయాన్ని దర్శిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో దంపతులు బ్రహ్మముళ్ళు వేసుకొని నియమ నిష్టలతో పాలంక గుండంలో మూడు సార్లు మునుగుతారు. పెద్ద కొండ చరియ పైనుంచి పంచలింగాలపై జాలువారే నీటి బిందువుల కోసం సంతానం లేని దంపతులు దోసిళ్ళుపడతారు. దోసిళ్ళపై నీరు పడితే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ క్షేత్రానికి ఎడమ వైపున ఉన్న స్థానాల ఘటికగా పిలువబడు సుమారు 300 అడుగుల ఎత్తైన జలపాతం ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. పాలంక ఉత్సవాల కోసం నల్లమల అడవికి గుంటూరు, మహబూబ్ నగర్, కర్నూలు, ప్రకాశం, జిల్లాల నుంచే కాక విజయవాడ, హైదరాబాదు తదితర ముఖ్య పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

మాట్లాడుతున్న డాక్టర్ చైతన్య కృష్ణ

టిబి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ షేక్ జమీఉల్లా అధ్యక్షతన టిబి ముక్త పంచాయత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్యకష్ణ మాట్లాడుతూ టిబి వ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గాలిలోని తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందన్నారు. టిబి జిల్లా కోఆర్డినేటర్ రత్నకుమారి మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు రెండు వారాల నుంచి జ్వరం బరువు తగ్గటం కళ్ళలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జమిఉల్లా, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, నిస్సార్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సర్పంచి వనజ

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-సింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్, సత్రం బడిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సర్పంచి తాటిపర్తి వనజ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లలకు అందించే పోషక ఆహార పదార్థాలు, గుడ్లు, కందిపప్పు, బెల్లం, చిక్కిలు తనిఖీ చేశారు. మెనూను మరియు హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పంచాయతీ బిల్‌కలెక్టర్ రామయ్య, జాన్ కిషోర్, ప్రణయ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి మూఢ విశ్వాసాలు అవరోధం

ప్రజాశక్తి-చీమకుర్తి

మూఢవిశ్వాసాలు సమాజాభివృద్ధికి అవరోధం కాగలదని యూటిఎఫ్ జిల్లా నాయకులు డి వీరాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక దాచూరి రామిరెడ్డి భవనంలో యూటిఎఫ్, జెవివి, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీసర్కిల్‌లో ఆయన మాట్లాడారు.

మాట్లాడుతున్న వీరాంజనేయులు

కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి జయప్రకాష్, యూటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, చలువాది శ్రీను, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.వీరాంజనేయులు, పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు పూసపాటి వెంకటరావు, జెవివి నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, రమేష్, కెవిపిఎస్ నాయకులు రామారావు, సిఐటియు నాయకులు బి ఓబులేషు, శ్రీను, నాగయ్య పాల్గొన్నారు.